ప్రజాశక్తి
సోమవారం 1 డిసెంబర్ 2025
8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

మొవ్వలో వరి కుప్పలు వేస్తున్న రైతులు

వత్సవాయిలో కల్లాల్లో ఉన్న వరిపై పరదాలు

'దిత్వా' దిగులు

- వరి రైతుల్లో ఆందోళన
- హడావుడిగా కోతలు
- రోడ్లపైనే ధాన్యం
- పంటను కాపాడుకునేందుకు కష్టాలు
- పత్తి, మొక్కజొన్న తడవకుండా జాగ్రత్తలు

మొన్న మొంథా... నేడు దిత్వా తుపాన్లతో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని రైతులు దిగులు చెందుతున్నారు. దిత్వా తుపాను హెచ్చరికలతో ఎప్పుడు వర్షం కురుస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. తుపాను ప్రభావంతో ఆదివారం ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు పడటంతో రైతులు ఉరుకులు పరుగులు తీశారు. రైతులు వేలాది ఎకరాల్లో వరి పంట కోసి ధాన్యాన్ని ఆరబెట్టారు. 40 శాతం వరి కోతకు సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితుల్లో తుపాను రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

ప్రజాశక్తి-వీరులపాడు, కంచికచర్ల, వత్సవాయి, గుడ్లవల్లేరు, కోడూరు, మోపిదేవి, మొవ్వ, గుడివాడ

కృష్ణాజిల్లాలో 3.70 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటికి 60 శాతం కోతలు పూర్తయ్యాయి. పంట చేతికి వచ్చే తరుణంలో దిత్వా తుపాన్ ప్రభావంతో నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక రేట్లు చెల్లించి వరి కోతలు, కుప్పలు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో రోడ్ల మీద ఆరబోసిన ధాన్యాన్ని ఆఘమేఘాల మీద సంచుల్లోకి ఎత్తుతున్నారు. కొన్నిచోట్ల రోడ్లపైనే ధాన్యాన్ని వదిలేసి పరదాలను కప్పుతున్నారు. కోడూరు మండలంలో ప్రస్తుతం వరి కోతలు ముమ్మురంగా సాగుతున్నాయి. తుపాను నేపథ్యంలో యంత్రాల సహాయంతో వరి కోతలు కోస్తున్నారు. ఒకేసారి వేలాది ఎకరాలలో యంత్రాల ద్వారా వరి కోతలు కోయడంతో పలు గ్రామాల్లో ఎటు చూసినా రోడ్ల పైన ధాన్యం గుట్టలు కనిపిస్తున్నాయి. మిల్లర్ల వద్ద దిగుమతి చేసుకునే ఖాళీ లేక కాటాలు వేసి మూడు రోజులైనప్పటికీ రోడ్లపైనే ధాన్యం నిలిచిపోయిందని (మిగతా 2లో)

యుపిఎస్‌సి ఇపిఎఫ్‌ఒ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, అకౌంట్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) ఆదివారం నిర్వహించిన ఇపిఎఫ్‌ఒ పరీక్ష-2025 ప్రశాంతంగా ముగిసింది. ఉద్యోగ భవిష్య నిధి సంస్థలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం నగరంలో 15 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా 5,860 మంది అభ్యర్థులకు 2,183 మంది (37.25 శాతం) హాజరయ్యారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విజయవాడలోని సీవీఆర్ ఉన్నత పాఠశాల, చిట్టూరి హైస్కూలు, ప్రభాస్ పీజీ కళాశాల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన లైజనింగ్ అధికారులు, వెన్యూ సూపర్వైజర్లు, సమన్వయ శాఖల అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రతి ఒక్కరికి 'ఉపాధి హామీ'

- ఈ ఏడాది 45 లక్షల పని దినాలు లక్ష్యం
- రూ.135 కోట్లు కేటాయింపు
- 2.94 లక్షల మందికి జాబ్ కార్డులు
- లోపాలు సరిదిద్దేందుకు చర్యలు
- ఎన్‌టిఆర్ జిల్లా డ్వామా పీడీ రాము

ప్రజాశక్తి-విజయవాడ

గ్రామాల్లో ఎవరికైతే పని కావాలో అటువంటి ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ చట్టం ద్వారా పని కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.రాము తెలిపారు. కార్మికుల మస్టర్‌లో తప్పులు జరగకుండా నిరంతరం నిఘా ఉంచుతూ ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. గతేడాది కన్నా ఈ ఏడాది పని దినాలను కేంద్ర ప్రభుత్వం తగ్గించినా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పని కావాలని కోరుకున్న ప్రతి కార్మికుడికి పని చూపించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ చట్టం ఎన్‌టిఆర్ జిల్లాలో అమలు తీరుతెన్నులపై పీడీ 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: ఉపాధి హామీ చట్టం అమలు ఎలా ఉంది?

జవాబు: ప్రస్తుతం పశువుల షెడ్లు (మినీగోకులాలు) నిర్మాణాలు, ఉద్యానవన పంటల సాగు తదితర పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న: ఈ ఏడాది పని దినాల లక్ష్యం ఎంత?

జవాబు: ఈ ఆర్థిక సంవత్సరానికి పని లేని కార్మికులకు 45 లక్షల పని దినాలు కల్పించాల్సి ఉంది. అయితే గతేడాది మాత్రం 80 లక్షల పని దినాలు టార్గెట్‌గా ఉండేది. సగానికి సగం పని దినాలు తగ్గించారు. అయినా పని కావాలని వస్తున్న ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పించడం జరుగుతుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 38 లక్షల పని దినాలు (ఏప్రిల్ నుంచి నవంబర్) చూపించి రూ.114 కోట్ల వరకు పేమెంట్లు జరిగాయి.

ప్రశ్న: ఎంత మందికి జాబ్‌కార్డులను మంజూరు చేశారు?

జవాబు: ఎన్‌టిఆర్ జిల్లాలో (మిగతా 2లో)

అభ్యుదయవాది కుటుంబరావు

సంస్మరణ సభలో మంత్రి కొల్లు రవీంద్ర

సభలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

ప్రజాశక్తి-చల్లపల్లి

నిబద్ధత, నిజాయితీ కలిగిన అభ్యుదయవాది, ఆదర్శ కమ్యూనిస్టు కుటుంబరావు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల పరిధిలోని నడకుదురు పంచాయతీ శివారు నాదెళ్లవారిపాలెంలో యార్లగడ్డ వెంకట బసవ పూర్ణ కుటుంబరావు సంస్మరణ సభ సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సభలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఆర్‌టిసి కండెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ కార్మికుల సమస్యలపై కుటుంబరావు పోరాడారని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల వారసత్వాన్ని కందిపుచ్చుకుని కమ్యూనిజం పట్ల ఆకర్షితులై అభివృద్ధికి పోరాటాలు చేశారన్నారు. అభివృద్ధే ధ్యేయంగా కమ్యూనిజమే లక్ష్యంగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి కుటుంబరావు తీసుకెళ్లారన్నారు. ప్రజల కోసం మంచి చేసిన వారిని ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారని, ప్రజల మనిషి కుటుంబరావు అని కొనియాడారు. నేడు రాష్ట్రంలో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. మత్త విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మాజీ శాసనసభ్యులు పాటూరు రామయ్య మాట్లాడుతూ కుటుంబరావు కుటుంబ సభ్యులు కమ్యూనిస్టులకు (మిగతా 2లో)

అలరించిన చిన్నారులు

గుడివాడలో ముగిసిన బాలోత్సవం

వార్త 5లో

బ్యాడ్మింటన్ విజేతలకు ట్రోఫీలు అందజేత

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

పిబి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం 50వ ఏపీ కాలేజి టీచర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, పి.బి. సిద్ధార్థ కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలితప్రసాద్, ప్రిన్సిపాల్స్ డా. మేకా రమేష్, సి హెచ్. వెంకటేశ్వర్లు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) మాజీ చైర్మన్ అంకమ్మ చౌదరి ఆదివారం ట్రోఫీలు అందచేశారు. పురుషుల డబుల్స్ విజేతగా నిలిచిన ప్రవీణ్ కుమార్, అనిల్ కుమార్ (వి విట్)లకు నేషనల్ లితో ట్రోఫీని, మహిళల డబుల్స్ విజేతలు బి.కష్ణదీపిక, రమాదేవి (ఎన్టీఆర్ వి.ఇ.టి. కాలేజి)లకు బోయపాటి ట్రోఫీని అందచేసి అభినందించారు. మిక్సెడ్ డబుల్స్ విభాగంలో విజేతలు నాగసతీష్, కృష్ణదీపిక (బి.వి.సి..ఆర్వీఆర్) విజయ ట్రోఫీని, వెటరన్ డబుల్స్ విజేతలు జగదీశ్, అబ్దుల్ కలాం (పి.వి.పి. ఇంజనీరింగ్ కాలేజి)లకు పర్వతనేని బ్రహ్మయ్య ట్రోఫీ అందచేశారు. సూపర్ వెటరన్ డబుల్స్ విజేతలు జి.సాంబశివరావు, జె.రమేశ్ (కె.ఐ.టి.ఎస్. అక్షర)లకు అడుసుమిల్లి సూర్యనారాయణ ట్రోఫీ ప్రదానం చేశారు. పురుషుల బెస్ట్ ప్లేయర్ గా వెలగపూడి రామకష్ణ ట్రోఫీని ఎన్. వంశీ నరసింహారావు (బి.వి.సి. ఇంజనీరింగ్ కాలేజి, రాజమండ్రి) , మహిళల ఉత్తమ క్రీడాకారిణిగా ఆంధ్రభారతి ట్రోఫీని వై. వి. నందింగిన్ (సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ వర్సిటీ, విజయవాడ) అందుకున్నారు. సూపర్ వెటరన్ బెస్ట్ ప్లేయర్ గా బి. సీతారామిరెడ్డి ట్రోఫీని జె. రమేశ్ (చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ ఇనిస్టిట్యూట్, గుంటూరు), వెటరన్ బెస్ట్ ప్లేయర్ పురస్కారం కింద పర్వతనేని బ్రహ్మయ్య మెమోరియల్ ట్రోఫీని డా. వి. జగదీశ్ (పి.వి.పి. ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విజయవాడ)లకు అందచేశారు. రాష్ట్రస్థాయిలో ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మెన్ డబుల్స్ లో 100 టీములు, విమెన్ డబుల్స్ అంశంలో 38 టీంలు, వెటరన్ విభాగంలో 28 టీంలు, సూపర్ వెటరన్ విభాగంలో 12 టీంలు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 38 వర్సిటీ కళాశాలల నుంచి 328 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

'దిత్వా' దిగులు

రైతులు వాపోతున్నారు. ప్రైవేట్ మార్కెట్లో ధాన్యం అమ్ముకుందామంటే 1400 రూపాయలకే అడుగుతున్నారని తెలిపారు. వత్సవాయిలో రైతుల పరిస్థితిని ఆసరాగా చేసుకుని కోత మిషన్ల యజమానులు అదనంగా వసూలు చేస్తున్నారు. మోపిదేవి పరిధిలోని పెదప్రోలు హైవేపై ధాన్యాన్ని కుప్పలుగా పోశారు. మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోకపోవటంతో ధాన్యం బస్తాలు రోడ్లపైనే దర్శనమిస్తున్నాయి. మొవ్వలో రైతులు హడావుడిగా వరికుప్పలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. పనల మీద ఉన్న వరిపైరుకు ఎకరానికి రూ.5 వేలు చెల్లించి కుప్పలు వేయిస్తున్నారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో మొక్కజొన్న కంకులు విరుస్తున్నారు. యంత్రాల సహాయంతో హడావుడిగా మొక్కజొన్న కోతల్లో రైతులు నిమగ్నమయ్యారు. మొక్కజొన్నలు కుప్ప చేసి వర్షానికి తడవకుండా పట్టాలు కప్పుతున్నారు. వర్షం పడితే మొక్కజొన్న బూజుపట్టి కుళ్లిపోయే అవకాశం ఉంది. దీంతో రైతులు కూలి అదనంగా చెల్లించి పంటను కాపాడుకోటానికి నానాపాట్లు పడుతున్నారు. అలానే పత్తి తీతలు కూడా ముమ్మరంగా తీస్తున్నారు. ఇటీవల సంభవించిన మొంథా తుపాన్‌కు పొలంలోనే పత్తి తడిచి చేతికి రాకుండా పోయింది. ప్రస్తుతం పత్తి విరుపులు సాగుతున్నాయి. ఇళ్ల వద్ద నిల్వ ఉన్న పత్తి కూడా తడవకుండా రైతులు జాగ్రత్త పడుతున్నారు.

కోడూరులో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

ప్రస్తుతం వేలాది ఎకరాల్లోని ధాన్యం కల్లాల్లో ఉంది. బహిరంగ ప్రదేశాల్లో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఎక్కడికి తరలించాలో అర్థం కాక రైతులు అయోమయస్థితిలో ఉన్నారు. తేమ 17 శాతం కంటే ఎక్కువ ఉంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు ఐదు కిలోలు తరుగు తీస్తున్నారు. ఈ ఏడాది ఎకరాకు 25 బస్తాల దిగుబడి వచ్చింది. ఎంతో కొంత లాభం వస్తుందని రైతులు ఆశతో ఉన్న ఈ సమయంలో దిత్వా తుపాను ప్రభావం వల్ల నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మార్కెటింగ్ యార్డులకు తరలిద్దామంటే అక్కడ గోడౌన్లు ఖాళీ లేవు. ఈ పరిస్థితులలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఎలా రక్షించుకోవాలో అర్థం కాక రైతులు ఆందోళన చెందుతున్నారు.

అభ్యుదయవాది కుటుంబరావు

అండగా ఉండేవారని తెలిపారు. శాసనసభ ఎన్నికలలో తన విజయానికి ఎనలేని కృషి చేశారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శీలం నారాయణరావు మాట్లాడుతూ నడకుదురు-రాముడుపాలెం రోడ్డు అభివృద్ధికి, నాదెళ్లవారిపాలెం కేఈబి కెనాల్‌పై వంతెన నిర్మాణానికి, నడకుదురులో పిహెచ్ అభివృద్ధికి కుటుంబరావు కృషి చేశారన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు చల్లపల్లి జమిందార్ మిగులు పోరాటం, నివేశ స్థలాల కోసం చేసిన ఉద్యమాల్లో ఆయన పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌డబ్ల్యూ స్ నాయకులు నారాయణరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రాపు పోలినాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా, సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, విద్య అకాడమీ ప్రిన్సిపల్ నాగళ్ల భీమారావు, సిపిఎం నాయకులు జేజి బాబు, బోలెం రామారావు, మోహన్‌రావు, విశ్రాంత ఉద్యోగి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా రాజకుమార్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగరంలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం బాలత్సవ భవన్ వ నందు ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఖజానా, లెక్కల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర రెండవ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 19 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరైనారు. ఈ కార్యక్రమానికి ఏ.పి.జి.ఈ.ఎ. రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. సూర్యనారాయణ ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. ఈ సమావేశము నందు రాష్ట్ర అధ్యక్షుడుగా కె.రాజకుమార్, గౌరవ అధ్యక్షులుగా జి.రవికుమార్, రాష్ట్ర జనరల్ సెక్రటరీగా బి.శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.కృష్ణంరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కె.వి. సురేష్‌బాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు కె.రాజ్ కుమార్ అధ్యక్షోపన్యాసము చేస్తూ ఖజానా శాఖలో సహాయ ఖజానాధికారి నుండి అకౌంట్స్ ఆఫీసర్ , అసిస్టెంట్ డైరెక్టర్ నుండి డిప్యూటీ డైరెక్టర్ పదోన్నతుల విషయంలో తీవ్రమైన జ్యాప్యాన్ని ఆయన ఆక్షేపించారు. పదోన్నతులకు పూర్తిగా అర్హత ఉన్న మన శాఖ అధికారులు అనేకమంది పదవీ విరమణ చేయుచున్న నేపథ్యంలో ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పదోన్నతుల విషయంలో చొరవ చూపి పదోన్నతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయవలసినదిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశములో ఏపిజిఎ ప్రధాన కార్యదర్శి జి.రమేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.నాగసాయి, కరీముల్లా, హసీనా బేగం, కె.వి. సురేష్, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

నేటి నుండి చెస్ శిక్షణ

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: విజయవాడ మొగల్రాజపురం లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ప్రీ ప్లే స్కూల్, రాజీవ్ చెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా డిసెంబర్ ఒకటవ తేదీన సోమవారం నుంచి గురువారం వరకు ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదున్నర గంటల వరకు చదరంగం శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు రాజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ చదరంగం శిక్షణ తరగతులకు... ఆరు సంవత్సరముల వయసు నుంచి ప్రతి ఒక్కరూ బాల,బాలికలు ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని బిర్లా ఓపెన్ మైండ్స్ డైరెక్టర్ నీలిమ సుంకర, తెలిపారు .వివరాలకు 9246776655 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

జనార్ధన్‌కు సన్మానం

ప్రజాశక్తి-మొవ్వ: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సమావేశం ఆదివారం పెదపూడిలో వర్తక సంఘం కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అభయ ఆంజనేయస్వామి దేవస్థానం కట్టించిన దాత పామర్తి వీర జనార్ధన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ మొవ్వ మండలంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా చేస్తున్న కార్యక్రమాలు ఎంతో విలువైనవని వెలకట్టలేమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పిట్టు శ్రీనివాసరావు, కన్వీనర్ తాళ్లూరి మోహన్ కుమార్, సెక్రటరీ మాతంగి కిషోర్ బాబు, డైరెక్టర్ పాగోలు రమేష్ బాబు, సహాయ కార్యదర్శి కాటూరి శ్రీకాంత్, మంత్రయ్య, మీర్జా హసన్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: యూపీఎస్సీ సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు డా. బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణ కోసం మొత్తం 6, 361 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నేడు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులకు విశాఖ, విజయవాడ, తిరుపతి అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో నాలుగు నెలల పాటు అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో యూపీఎస్సీ ప్రిలిమ్స్‌కి శిక్షణ అందించనున్నారు.

ప్రతి ఒక్కరికి 'ఉపాధి హామీ'

2.94 లక్షల మందికి జాబ్ కార్డులు మంజూరు చేయగా, వారిలో 2.56 లక్షల మంది యాక్టివ్‌గా ఉన్నారు.

ప్రశ్న: పనుల గురించి వివరించగలరు?

జవాబు: సాధారణంగా గ్రామాల స్థాయిలో వేసవిలో చెరువుల్లో...కాలువల్లో పూడిక తీసే పనులు చేయించడం జరుగుతుంది. రైతుల పంట కాలువల్లో బోదిలు తీయించే పనులు జరుగుతాయి. వీటితో పాటు ఉద్యానవన పంటల సాగుకు సంబంధించి కార్మికులతో పనులు చేయించడం జరుగుతుంది. పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. మామిడి, కొబ్బరి, మునగ, మల్లి, గులాబి, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటల సాగుకు సంబంధించి పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న: ఏ ప్రాంతాల్లో ఎక్కువుగా ఎన్‌ఆర్‌ఇజిఎస్ పనులు జరుగుతుంటాయి?

జవాబు: తిరువూరు, విసన్నపేట, ఏ కొండూరు, రెడ్డిగూడెం, గంపలగూడెం, జగ్గయ్యపేట, వత్సవాయి, చందర్లపాడు, మైలవరం, ఇబ్రహీంపట్నం తదితర మండలాల పరిధిలో ఎక్కువుగా పనులు జరుగుతుంటాయి.

ప్రశ్న: ఇతర పనుల గురించి వివరించగలరు?

జవాబు: సిసి రోడ్ల నిర్మాణంతో పాటు పశువుల షెడ్లు నిర్మాణపు పనులు కూడా చేయించడం జరుగుతుంది. మినీ గోకులాల నిర్మాణాలకు అయ్యే రూ.రెండు లక్షల ఖర్చులో కేవలం పది శాతం మాత్రమే లబ్దిదారుడు భరించాల్సి ఉండగా, రూ. లక్షా 80 వేలు ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా లబ్ది చేకూరుతుంది. రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

ప్రశ్న: పారదర్శకంగా అమలు చేసేందుకు తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: లోపాలను సరి చేసి పారదర్శకంగా ఉండేందుకు ముఖ్యంగా కార్మికుల హాజరులో దొంగ మస్టర్ విధానాన్ని అరికట్టడానికి వీలుగా ఫేషియల్ అథంటికేషన్ (ఎఫ్ఎసి) ఈ నవంబర్ నుంచి అమలు చేయడం జరుగుతుంది.

ప్రశ్న: కార్మికులకు ఇప్పటి వరకు ఎంత బకాయి చెల్లించాల్సి ఉంటుంది.?

జవాబు: గత అక్టోబర్, నవంబర్ మాసాలకు సంబంధించి రూ.15 లక్షల వరకు చేసిన వర్క్‌కు వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఎప్పటికప్పుడు నిఘా పెంచుతూ, పనులు సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు.

వసుధకు మంత్రి అభినందన

విజయవాడ: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ లెవెల్ సెలక్షన్స్‌లో మొదటి స్థానం సాధించి నేషనల్‌కు సెలెక్ట్ అయిన కె.వసుధ, కోచ్ మహేష్‌లను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖరరావు అభినందించారు. మరెన్నో పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. వసుధ ఈ నెల 24 నుండి 26 వరకు రాజమహేంద్రవరంలో ఎస్.కె.వి.టి డిగ్రీ కళాశాల అంబేద్కర్ భవన్లో నిర్వహించిన అండర్ 14, 17, 19 ఎస్‌జిఎఫ్ కరాటే పోటీలలో ప్లస్ 50 కేజీలో మొదటి బహుమతి సాధించి నేషనల్‌కు సెలెక్ట్ కావడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. వసుధ అరవింద హైస్కూల్లో చదువుతుండగా జేకే గోజూర్యో కరాటే అకాడమీలో కరాటే నేర్చుకొని ఇంతటి స్థాయికి చేరుకున్నందుకు కోచ్ మహేష్‌ని, జెకే గోజుర్యో ఫౌండర్ జె.శ్రీనివాసు, టెక్నికల్ డైరెక్టర్ హరినాథ్‌ను అభినందించారు. డిసెంబర్ 14 నుంచి 19 వరకు ఇండోర్లో జరిగే నేషనల్ పోటీల్లో వసుధ పాల్గోనుంది.

ఉత్సాహంగా సైక్లోథాన్

ప్రజాశక్తి - గుడివాడ : ఎన్టీఆర్ స్టేడియం కమిటి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ తొక్కు బ్రో' నినాదంతో గుడివాడ సైక్లోథాన్ 2025 సైకిల్ ర్యాలీ ఆదివారం సందడి వాతావరణంలో జరిగింది. ఈగల్ టిం ఐజి ఆర్కె రవికిష్ణ, ఎమ్మెల్యే దపంతులు వెనిగండ్ల రాము, సుఖద ఎస్పి విద్యాసాగర్‌నాయుడు పలు అధికార ప్రముఖులు సైకిల్ తొక్కుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత జరిగిన సభలో విద్యార్థులను ఉద్దేశించి ఈగల్ టీం ఐజి రవికిష్ణ మాట్లాడుతూ తాము పట్టుకున్న అనేక కేసుల్లో చెడు స్నేహాలతో డ్రగ్స్ బారిన పడి ఎందరో అమాయకులు తమ జీవితాలను నాశనం చేసుకున్నారన్నారు. డగ్స్ సమాచారం తెలిస్తే ప్రభుత్వ టోల్ ఫ్రీ 1972 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ డ్రగ్స్ వద్దు బ్రో అనేది మనందరి నినాదం కావాలన్నారు. ఎమ్మెల్యే రాము దంపతులు పావురాలు వదిలి ర్యాలీను లాంఛనంగా ప్రారంభించారు. స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు జెండా ఊపి సైకిల్ ర్యాలీలను ప్రారంభించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు స్టేడియం కమిటీ తరపున సర్టిఫికెట్స్, బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, ఈగల్ టీం ఐపీఎస్ మహేశ్వర రాజు, మచిలీపట్నం డిఎస్పీ రాజా, ఐఎంఏ వైద్యులు డాక్టర్ పొట్లూరి వంశీ, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ప్రారంభిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

శ్రావ్యకృష్ణ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రావ్యకృష్ణ ఆసుపత్రిని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించా రు. స్వచ్ఛ చల్లపల్లి సారథి ప్రముఖ వైద్యులు డాక్టర్ డి ఆర్ కె ప్రసాద్, డాక్టర్ సబినేని భవాని ప్రసాద్, డాక్టర్ నల్లపనేని కీర్తి, మండలి వెంకట్రాం, మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, కందుల కృష్ణ తేజలు అతిథులుగా పాల్గొని వైద్యుల గదు లు, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లను ప్రారంభిం చారు. కార్యక్రమంలో పీ పీ చైర్మన్ దేవబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీపీ కోటా విజయ రాధిక, మోపిదేవి జెడ్పిటిసి సభ్యు లు మెడబలిమి మల్లికార్జునరావు, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ పాల్గొన్నారు.

నేడు 'మీకోసం' రద్దు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : దిత్వా తుఫాను కారణంగా డిసెంబర్ 1వ తేదీ సోమవారం కలెక్టరేట్లో జరగవలసిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాను ముందస్తు జాగ్రత్త పనులలో జిల్లా అధికారులందరూ నిమగ్నమై ఉన్నందున మీకోసం కార్యక్రమం నిర్వహించడం లేదన్నారు.

స్పోర్ట్స్ మీట్ వాయిదా

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : దిత్వా తుఫాన్ ప్రభావంతో డిసెంబర్ 1న జరగాల్సిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ (పారా ఒలింపిక్స్) వాయిదా పడినట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్. కుముదిని సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. తాజా వాతావరణ పరిస్థితులను పరిశీలించి కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆమె పేర్కొన్నారు.

ధాన్యం రైతులను ఆదుకోవాలి : కైలే

ప్రజాశక్తి-పామర్రు : పండించిన పంటను దక్కించుకోలేక నియోజకవర్గంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. ఈ మేరకు తన కార్యాలయం నుండి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు గిట్టుబాటు ధర, ఇన్పుట్ సబ్సిడీ కల్పించి ఒక్క రూపాయి కట్టిన వారికి ఇన్సూరెన్స్ ఇచ్చి సకాలంలో ఆదుకున్నారన్నారు. నేడు కోటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదన్నారు. పార్టీలతో ప్రమేయం లేకుండా ప్రతి రైతును ఆదుకోవాలని అన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు గుడ్లవల్లేరు మండలం యువజన విభాగం అధ్యక్షుడు గుదే రవి ఆధ్వర్యంలో యువజన విభాగం తరుపున కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు ఈ కార్యక్ర మంలో గుడ్లవలేరు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కృష్ణాజిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మిరియాల బాబు రాజేంద్ర ప్రసాద్, గుడివాడ నియోజక వర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుంచపర్తి సాయి, ఐటీ విభాగం అధ్యక్షుడు కుందేటి ఫణి, ఎస్సీ సెల్ చేబత్తిన నందీశ్వరరావు, సింగవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన విజయ్

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడును అవనిగడ్డ నియోజకవర్గ టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు మేడికొండ విజయ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆది వారం ఆయన అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ శనివారం సాయంత్రం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షులు, మంత్రి చంద్రబాబును కలసి అవనిగడ్డ నియోజక వర్గంలో తెలుగు యువతకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు విజయ్ తెలిపారు.

ధాన్యం రైతులతో మాట్లాడతున్న సింహాద్రి

మిల్లర్లు ధాన్యం తీసుకునేలా ఆదేశించాలి : సింహాద్రి

ప్రజాశక్తి-ఘంటసాల : దిత్వా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మిల్లర్లు ధాన్యం తీసుకునేలా అధికారులను ఆదేశించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఘంటసాల మండలం దేవకోట గ్రామంలో ప్రధాన రహదారుల వెంబడి పట్టాలు కప్పిన, బస్తాల్లో ఎత్తుతున్న ధాన్యాన్ని ఆదివారం రమేష్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా రైతులతో మాట్లాడి ధాన్యం సేకరణలో సమస్యలను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం అమ్ముకుందామని రోజుల తరబడి ఎదురు చూస్తున్న రైతులు, కౌలు రైతులు దిత్వా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మరింత అష్టకష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు ఇబ్బందుల్లేకుండా మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ఆర్భాట ప్రచారమే కాని క్షేత్రస్థాయిలో కానరావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చింతలపూడి బాల భాస్కరరావు (బాలు) తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొల్పిన గురజాడ కవితలు : పెద్దిరాజు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : . ప్రజా కవి, గురజాడ అప్పారావు రచనలు, కవితలు సామాన్యుడికి సైతం మనసుకు హత్తుకునేలా రంజింప చేసేవని మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు పేర్కొన్నారు. మచిలీపట్నం బుట్టాయిపేట జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం గురజాడ అప్పారావు 110వ వర్ధంతి సందర్భంగా 'గురజాడ రచనలు విశిష్టత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు మచిలీపట్నం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో కన్వీనర్ పి రాందేవ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు మాట్లాడుతూ గురజాడ తన రచనల ద్వారా సమాజంలోని అసమానతలను తొలగించేలా ప్రజలను జాగతం చేసేవారన్నారు. బాల్య వివాహాలను అరికట్టేలా ప్రజలను చైతన్య పరచడంతో పాటు ముక్కుపచ్చలారని చిన్నారులను 60 ఏళ్ల వృద్ధులకు ఇచ్చి కట్టబెట్టే దుశ్సాంప్రదాయానికి తెరదించారన్నారు. పట్టణ పౌర సంఘం నాయకులు కొడాలి శర్మ, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంగత రమాదేవి, మచిలీపట్నం ఐద్వా మహిళా ప్రతినిధులు జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పి నాగయ్య, సిఐటియు మచిలీపట్నం కన్వీనర్ చిరువోలు జయరావు పాల్గొన్నారు.

మాట్లాడతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు

విద్యుత్ వైర్ల దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-కంకిపాడు : ఖాళీగా ఉన్న వెంచర్లలోని కరెంట్ స్తంభాలకు ఉన్న కరెంట్ వైర్లను చోరీ చేసే ఇరువురిని అరెస్టు చేసినట్లు సీఐ మురళీకష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా పెనుమాకకు చెందిన గరికే చందు, యర్రబాలెంకు చెందిన నరసింహరాజులను అరెస్ట్ చేసి 3 లక్షల విలువైన వైర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు. కేసు లో ప్రతిభ ను కనబరిచిన ఎస్ఐ సందీప్, మరో ఎస్ఐ సురేష్ లను అభినందించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - గుడివాడ : రౌడీ షీటర్లు మంచి ప్రవర్తనతో ఉండి రౌడీషీట్ తొలగించుకోవాలని 2టౌన్ సిఐ హనీష్ అన్నారు. ఆదివారం స్థానిక 2టౌన్ పోలీసు స్టేషన్‌లో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు ఎలాంటి తగదాలకు పోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

కోటేశ్వరమ్మకు నివాళి

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దగూడెంకు చెందిన వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు దిరిశం పిచ్చేశ్వరరావు మాతృమూర్తి, ఘంట సాల ఎంపిటిసి దిరిశం వెంకటలక్ష్మి అత్త దిరిశం కోటేశ్వరమ్మ(80) (సుజ్ఞానం), వయస్సు రీత్యా అనారోగ్యం కారణంగా శనివారం రాత్రి మరణించారు. ఆదివారం ఉదయం ఘంటసాల లోని వారి నివాసం వద్ద కోటేశ్వరమ్మ పార్థివ దేహాన్ని అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఘంటసాల మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు చింతలపూడి బాల భాస్కరరావు(బాలు), వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గరికిపాటి కష్టారావు తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి-పామర్రు : సీఎంఆర్ఎఫ్ పథకం పేద వారికి ఆర్థిక భరోసా లభిస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఆదివారం పామర్రుకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి గహాలకు వెళ్లి స్వహస్తాలతో అందించారు. పెందుర్తి భువనేశ్వరికి 24,866 రూపాయల నగదు చెక్కును,సంబంగి శ్రీనివాసరావు 88,729 రూపాయల నగదు చెక్కును,పరస లక్ష్మయ్య కు 37,710 నగదు చెక్కును,ముంగండి పార్వతికి 42,205 రూపాయల నగదు చెక్కును ఎమ్మెల్యే వర్ల అందించారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, జిల్లా టిడిపి ప్రచార కార్యదర్శి చాట్ల పెద్ద రమేష్, నియోజకవర్గ తెలుగు యువత సహాయ కార్యదర్శి పి సందీప్,యార్డ్ మాజీ చైర్మన్ మండపాక శంకర్ బాబు పాల్గొన్నారు.

పెంచలయ్యను హత్య చేసిన నిందితులను శిక్షించాలి

- సిపిఎం, ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసనలు

విజయవాడలో నిరసన ప్రదర్శన

50వ డివిజన్ మహంతిపురంలో కొవ్వొత్తుల ప్రదర్శన

విజయవాడ : గంజాయి ముఠా చేతుల్లో హత్య గావించబడిన పెంచలయ్య మృతికి కారకులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం సిపిఎం, ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల ఆందోళనలు చేశారు. విజయవాడలోని కృష్ణ హోటల్ సెంటర్, పాయకాపురం చెరువు పార్క్, ప్రకాష్ నగర్ , రాణిగారితోట ప్రాంతాల్లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. విజయవాడలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి మాఫియా రాజ్యమేలుతున్నాయని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. రెండు రోజుల క్రితం నెల్లూరులో డ్రగ్స్ మాఫియాకు వ్యతిరేకంగా పోరాడిన యువజన నాయకుడు, ప్రజా కళాకారుడు పెంచలయ్యను పట్టపగలు నడి రోడ్డు మీద గంజాయి గ్యాంగ్ అతి కిరాతకంగా నరికి చంపారని, అరెస్టు చేయడానికి వెళ్లిన పోలీసులపైనే దాడి చేయడం చూస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతల ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని అన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడిన పెంచలయ్య మృతికి కారకులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.కృష్ణ, సిఐటియు నాయకులు టి.ప్రవీణ్, సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు శివ, నిజాముద్దీన్, పాల్గొన్నారు. **విస్సన్నపేట :** విస్సన్నపేటలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. ప్రజా కళారూపాల్లో గంజాయి వలన యువత పాడైపోతుందని తెలియజేసిన పెంచలయ్యను అతి దారుణంగా గంజాయి ముఠా హత్య చేయటం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయిని పూర్తి స్థాయిలో నివారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. **విజయవాడ సిటీ :** సిపిఎం నాయకులు, ప్రజాకళాకారుడు కె పెంచలయ్యను దారుణంగా హత్య చేసిన గంజాయి మాఫియా ముఠాను కఠినంగా శిక్షించాలంటూ సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 50వ డివిజన్ మహంతిపురంలో ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు, ఐద్వా, విద్యార్థి, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో పెంచలయ్య చిత్రపటాలు చేతబూని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బోయి సత్యబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి మాదక ద్రవ్యాల మాఫియా ఆగడాలకు పెంచలయ్య బలైయ్యారని మండిపడ్డారు. గంజాయి మాఫియా నియంత్రించడంలో రాష్ట్ర పోలీసు వ్యవస్థ వైఫల్యం చెందిందని విమర్శించారు. పెంచలయ్య హత్యకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఐద్వా పశ్చిమ గౌరవాధ్యక్షురాలు గాదె ఆదిలక్ష్మి మాట్లాడుతూ గంజాయి మాఫియా చేతిలో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబానికి సిపిఎం తరపున అండగా నిలబడతామన్నారు. పెంచలయ్య హత్యకు పాల్పడిన మాఫియా ముఠాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ సిపిఎం నాయకులు,ఐద్వా, విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవంతంగా హై ఇంపాక్ట్ ఇన్వెస్టర్ సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా హై ఇంపాక్ట్ రీజినల్ ఇన్వెస్టర్ సెమినార్‌ను విజయవంతంగా పూర్తి చేసిందని సదస్సు ఛైర్మన్ పాండే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్ దేశవ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత, పెట్టుబడిదారుల్లో అవగాహన, పెట్టుబడిదారుల రక్షణను బలోపేతం చేయడం లక్ష్యంగా భాగస్వామ్య చొరవగా ముందుకు వచ్చిందని తెలిపారు. "పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకు పారదర్శకమైన, బలమైన, న్యాయమైన నియంత్రణ వ్యవస్థను రూపుదిద్దడంలో సెబీ అచంచల నిబద్ధత గురించి తెలియచేశారు. పెట్టుబడిదారుల రక్షణ, మార్కెట్ సమగ్రత అత్యంత కీలకమని అన్నారు. మొత్తం మార్కెట్ పర్యావరణ వ్యవస్థకు ప్రయోజనం చేకూర్చే పెట్టుబడి సంస్కృతిని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని సెబీ ఛైర్మన్ తెలిపారు.

ఎపి కో ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఫణి పేర్రాజు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సహకార శాఖ ఉద్యోగుల సంఘం 'ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ ' రాష్ట్ర మహాజన సభ ఆదివారం విజయవాడ రెవెన్యూ భవన్లో జరిగింది. టి.వి ఫణిపేర్రాజు అధ్యక్షుడిగా జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల సమావేశంలో తొలిసారిగా నలుపు రంగు ప్యాంటు, తెలుపు చొక్కాలతో ఏకరూప దుస్తులతో అన్ని జిల్లాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదర్ వివిధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు అతిథులుగా హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు సూర్యాపేటలో ఉన్న సహకార భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ఎన్నికకు నామినేషన్లు దాఖలు చేసిన తరువాత రెవెన్యూ భవన్ నందు జరిగిన మహాజన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీవీ పని పేర్రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తించి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో సభ్యుడిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ గత 56 సంవత్సరాలుగా క్రమశిక్షణకు మారుపేరుగా నడుస్తున్నదని అన్నారు. నవంబర్ నెలలోనే 25 జిల్లాలకు ఎన్నికలు నిర్వహించుకుని రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా ఎన్నికలు నిర్వహించి ఉన్నామని తెలిపారు. గత 16 సంవత్సరాలుగా అధ్యక్షుడిగా ఉంటూ మరొకసారి నన్ను ఎన్నుకున్న సహకార ఉద్యోగులకు మన మనస్పూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తూ మరింత బాధ్యతగా పనిచేస్తానని తెలియచేశారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా టీవీ ఫణి పేర్రాజు (డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా), ప్రధాన కార్యదర్శి జి సురేష్ నాయుడు (గుంటూరు), కోశాధికారి జి సి బి వి కోటేశ్వరరావు (నెల్లూరు), సహ అధ్యక్షుడుగా పి నాగ రమణయ్య (కర్నూలు), ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె రవిశంకర్ (శ్రీకాకుళం), ఉపాధ్యక్షులుగా ఎస్ శ్రీనివాసులు రెడ్డి (చిత్తూరు), డి విజయ్ కుమార్, (కృష్ణా), ఎం.వి.కొండారెడ్డి (అన్నమయ్య), పి. రాజశేఖర్ (ఎన్టీఆర్) ఎం రషీద్ అహ్మద్ (నంద్యాల) ఎస్ సురేంద్రబాబు (ప్రకాశం) ఎ . కె.ఎస్.ఎన్. మూర్తి (ఏలూరు) జీ.కే బాల గంగాధర్ (అనంతపురం) బి.శ్రీనివాస్ (అనకాపల్లి) ఎన్నికయ్యారు.

శ్రీరాం సుబ్బారావుకు సత్కారం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు గత 75 సంవత్సరాలుగా బంగారం ఆభరణాల వ్యాపారంలో విశేష సేవలు అందిస్తూ కొనసాగుతున్నందుకు ఏపీ జెమ్ అండ్ జ్యువెలరీ ఫెయిర్, ఏపీ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ సంయుక్తంగా "ఉత్తమ అవార్డు"ను అందుకున్నారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట తెలుగుదేశం పార్టీకి చెందిన జిల్లా టిడిపి అధికార ప్రతినిధి షేక్ సయ్యద్ అన్వర్, షాదీ ఖానా చైర్మన్ సబ్బు, దర్గా కమిటీ చైర్మన్ రఫీ, మైనార్టీ నాయకులు అక్బర్, అస్లాం, ఉమర్, జాఫర్, మత పెద్దలు అవార్డు గ్రహీత శ్రీరాం సుబ్బారావును ఘనంగా సన్మానించారు.

స్విగ్గీ 'హౌ ఈట్స్ 2025' ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్విగ్గీ సమాచారం కోసం హౌ ఇండియా ఈట్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని సంస్థ ప్రతినిధి ఎం.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎస్ఈ, బిఎస్ఈ ప్రముఖ ఆన్-డిమాండ్ కన్వీనియెన్స్ ప్లాట్ ఫాం అని తెలిపారు. కియర్ని భాగస్వామ్యంతో తన వార్షిక నివేదిక "హౌ ఇండియా ఈట్స్" 2025 ఎడిషన్ ను విడుదల చేసింది అని తెలిపారు దీని ద్వారా స్విగ్గి కార్యకలాపాలు, విస్తరణ గురించి తెలియచేశారు. వివరాలకు స్విగ్గి ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

వైభవంగా నవగ్రహాల పునఃప్రతిష్ట

ప్రజాశక్తి- పెనుగంచిప్రోలు : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నవగ్రహాల పున ప్రతిష్ట కార్యక్రమం అర్చకులు వలం కళ సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు ముందుగా స్వామి వద్ద ప్రత్యేక పూజలు, హోమాలకు శస్త్రోస్తకం నిర్వహించారు అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మరుపిళ్ల తిరుమలేశ్వరరావు సేవలు నిరూపమానం

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : రాష్ట్ర నగరాల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల తిరుమలేశ్వరరావు సంతాప సభ ఆదివారం జరిగింది. కొత్తపేట నెహ్రు బొమ్మ సెంటర్లో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో జరిగిన తిరుమలేశ్వరరావు సంతాప సభలో పలువురు డైరెక్టర్లు పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం సుమారు 300 మందికి అన్న వితరణ చేశారు. టిడిపి సీనియర్ నేతగా మరుపిళ్ల తిరుమలేశ్వరరావు పార్టీ బలోపేతం కోసం నిరంతరం సేవలు అందించారని, నగరాల కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొద్ది కాలంలోనే మృతి చెందడం దిగ్భ్రాంతి కలిగించిందని ఈ సందర్భంగా డైరెక్టర్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్లు సుకాశి కిరణ్ కుమార్, బేవర సుధాకర్,తమ్మిన విజయ్ కుమార్, నాగోతి సూర్య ప్రకాష్, 46, 47 వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు పోతినేడి లోకేష్, నాగోతి రామారావు, 51 వ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు,కుంచెం దుర్గారావు, బేవర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ మాడపాటి క్లబ్‌లో ఆదివారం నగరాల వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల తిరుమలేశ్వరావు సంతాప సభ కార్యక్రమం జరిగింది. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నూర్ భాషా సహకార ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా కార్యక్రమానికి హాజరై మరుపిళ్ళ తిరుమలేశ్వరావు చిత్రపటం వద్ద నివాళ లర్పించారు. ఈ కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్లు బేవర సాయి సుధాకర్, సుకాసి కిరణ్, కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, ఉమ్మడి చంటి, మహదేవ అప్పాజీ రావు, టిడిపి నాయకులు మైలవరం మైలవరపు దుర్గారావు, సగురుపిళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



'లచన్ విస్టా' గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్ ప్రారంభం

విజయవాడ :విజయవాడ ఏలూరు రోడ్డుకు సమీపంలోని గుణదలలో "లచన్ విస్టా" అనే ప్రతిష్ఠాత్మక గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టును ప్రారంభించినట్లు లచన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లాది కాశీవిశ్వనాథ్ తెలిపారు. సృజనాత్మక ప్రణాళికలు, ఆధునిక డిజైన్లు, నాణ్యమైన నిర్మాణ సేవలతో కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. 2013 ఆగస్టులో విజయవాడ కేంద్రంగా సంస్థను స్థాపించామని, ఇప్పటి వరకు 450కిపైగా ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసిన అనుభవం సంస్థకు ఉందని తెలిపారు. ప్రస్తుతం 4 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న "లచన్ విస్టా" ప్రాజెక్టులో విశాలమైన 2 అండ్ 3 బిహెచ్‌కె ప్లాట్స్‌తోపాటు 15,000 చదరపు అడుగుల లగ్జరీ క్లబ్ హౌస్, ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉండనున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో 100 శాతం వాస్తు నిర్మాణం, తూర్పు - పశ్చిమ ముఖద్వారం ఫ్లాట్స్, ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్, ఆర్ఒ వాటర్ ప్లాంట్, 24/7 భద్రత, కార్ పార్కింగ్, లిఫ్ట్ వంటి సౌకర్యాలు ఉంటాయని వివరించారు. "లచన్ విస్టా" ప్రశాంతమైన, సురక్షితమైన ఆధునిక జీవనానికి ఉత్తమ చిరునామాగా నిలుస్తుందన్నారు. వివరాలకు లచన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, 5వ అంతస్తు, డిఆర్ఆర్ కాంప్లెక్స్, బిఎస్ఎన్ఎల్ భవన్ ఎదురు, ఏలూరు రోడ్, విజయవాడ చిరునామానుగాని, ఫోన్ 9160303339 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అలరించిన చిన్నారులు

• గుడివాడలో ముగిసిన బాలోత్సవం

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ మాంటిస్సోరి పాఠశాలలో జరుగుతున్న బాలోత్సవాలలో ఆదివారం చిన్నారులు పలు అంశాలలో ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. శాస్త్రీయనత్యం, జానపద నత్యం, విచిత్ర వేషధారణ, రంగవల్లులు, కథాకథనం, ఫ్యాన్సీ డ్రెస్, పేపర్ క్రాఫ్టింగ్, ఇంగ్లిష్, తెలుగు, వక్తృత్వం, స్పెల్‌బీ, మెమొరీ టెస్ట్, మ్యాప్ పాయింటింగ్, సీనియర్, జూనియర్, విభాగాలలో బాలలు నైపుణ్యాన్ని ప్రదర్శించి పెద్దలను మంత్ర ముగ్ధులను చేశారు. ఈఅంశాలలో న్యాయ నిర్ణేతలుగా, వి.వి.రాఘవాచారి, వి.కష్ణకిషోర్, ఆర్.వి.యల్. నరసింహారావు, నరహరి శెట్టి ప్రసాద్, కె.శ్రీధర్, కె.సుధాకర్, నాంచారయ్య, జయలక్ష్మి, ప్రసాద్, అహల్యా దేవి, యస్.మహేష్, యం.పద్మలత, ప్రసూనాంబ, వై.సత్యనారాయణ, రమ్యారెడ్డి, తదితరులు వ్యవహరి ంచారు. ముగింపు సభకు బాలోత్సవ గౌరవాధ్యక్షులు కోగంటి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. రాష్ట్రీయ పండిత పరిషత్ అధ్యక్షులు ఆర్.వి.యల్.నరసింహారావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆర్.డి.వో జి.బాలసుబ్రహ్మణ్యం సభనుద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులు ఆటపాటలలోను, చదువులలోను రాణించటానికి ఇటువంటి బాలోత్సవాలు దోహదం చేస్తాయన్నారు. రెండు రోజుల పాటు చక్కగా ఉత్సవాలను నిర్వహించిన బాలోత్సవ కమిటీని అభినందించారు. విద్యార్థులు బాల్యదశ నుండి విద్యాబుద్ధులు తోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను కూడా అలవరచు కోవాలన్నారు. మొత్తంమీద 47 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గుడివాడ ఎంఈవో-2 బాలాజీ, ఎన్‌టిఆర్ స్టేడియం సంయుక్త కార్యదర్శి యలవర్తి శ్రీనివాసరావు, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మాగంటి శ్రీనివాసరావు, వికెఆర్,విఎన్‌బి కరెస్పాండెంట్ వేములపల్లి కోదండ రామయ్య, కెటిఆర్ కళాశాల సెక్రటరీ పర్వతనేని నిర్మల, ఎ.యన్.ఆర్.కళాశాల కరస్పాండెంట్ కె.అప్పారావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అడుసుమిల్లి శ్రీనివాసరావు, మానవతా ట్రస్టు అధినేత దండమూడి సీతారామయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాదల వెంకటేశ్వరరావు, ఆర్.సి.పి.రెడ్డి, కళాకారులు వై.కోటేశ్వరరావు, ఐద్వా పట్టణ కార్యదర్శి పి.రజని తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే హెచ్ఐవి నివారణ

• జిల్లా ఎయిడ్స్, లెప్రోసీ, టీబీ అధికారి డాక్టర్ ఎ.వెంకట్రావు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : హెచ్ఐవీ నుంచి రక్షించుకోవడానికి అప్రమత్తతే ప్రధాన ఆయుధమని జిల్లా ఎయిడ్స్, లెప్రోసీ, టీబీ అధికారి డాక్టర్ ఏ. వెంకట్రావు తెలిపారు. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 30న రంగోలీ, కొవ్వొత్తులతో వెలుగు జాగతి కార్యక్రమం, సోమవారం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి నుండి ర్యాలీ, మంగళ వారం ఏఆర్టి సెంటర్లోని పిల్లలు, జిల్లా ఉన్నతాధికారులు కలిసి విందు భోజనం చేస్తారన్నారు. అనంతరం బాధిత పిల్లలకు వెయ్యి రూపాయలు ఖరీదు చేసే పౌష్టిక ఆహారం పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు ఎయిడ్స్ బారిన పడకుండా ఉండేందుకు ఏబీసీ సూత్రాన్ని తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. ఇందులో ఎ- వివాహానికి ముందు శంగార సంబంధాలకు దూరంగా ఉండడం, బి-వివాహిత జీవితం లో జీవిత భాగస్వా మితో మాత్రమే శారీరక సంబంధాలు కలిగి ఉండటం, సీ-ప్రతి సారి కండోమ్‌ను సరిగా వినియోగించడం వంటివి పాటించాలని వీటిపై స్వచ్ఛంద సంస్థలతో కలిసి విస్తత ప్రచారం కొనసాగించడం జరుగుతుందన్నారు. హెచ్ఐవీ నియంత్రణలో పురోగతి సాధించినప్పటికీ వ్యాధి ఇంకా పూర్తిగా నిర్మూలించబడలేదన్నారు. కాబట్టి ప్రతిఒక్కరు హెచ్ఐవీ పై అవగాహన కలిగి అప్రమత్తతో ఉండాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 12,052 మంది హెచ్ఐవీ బాధితులు నమోదు కాగా 7,072 మంది బాధితులు ప్రభుత్వ వైద్య సేవలు అందుతున్నాయన్నారు.

రేపటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : డోకిపర్రు భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారి దేవస్థాన దశమ వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను చేపట్టనున్నట్లు నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ తెలిపారు. ఈ దశమ వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవంలో భాగంగా 2న సాయంత్రం అంకురారోపణము, 3న ధ్వజారోహణము, సూర్యప్రభ వాహనము, శేష వాహనము, హంసవాహనము, గజవాహనం, రథోత్సవం, గరుడోత్సవం, చక్రస్నానం, విశేష శ్రీ శ్రీనివాస కళ్యాణోత్సవం, ధ్వజారోహణముతో ఈ బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా చేపట్టనున్నట్లు చెప్పారు.

వెంకటేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-చల్లపల్లి : విధి నిర్వహణలో అధికారుల, ప్రజా ప్రతినిధుల మన్ననలు పొందిన వ్యక్తి పోతుమూడి వెంకటేశ్వరరావు అని పలువురు వక్తలు అభినందించారు. గత 42 సంవత్సరాలుగా పంచాయతీ రాజ్ శాఖలో పనిచేసి మండల పరిషత్ కార్యాలయం అటెండర్ గా పదవి విరమణ చేసిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో వెంకటేశ్వరరావు దంపతులను పూల మాలలతో సత్కరించారు. ఎంపీపీ విజయరాధికా, ఎంపిడిఓ ఎంఎం ఆనంద కుమారి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కో ఆప్షన్ సభ్యులు షేక్ నబీ ఘోరీ, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, పంచాయతీ కార్యదర్శి పివి మాధవేంద్రరావు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమకు, ఉప్పెన బాధితులకు తన సేవల ద్వారా భారత జనబంధువుగా మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు నిలిచారని టిడిపి తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్న) అన్నారు. ఎం.వి. కృష్ణారావు శతజయంతి వేడుకలలో భాగంగా ఆదివారం ఆమనగడ్డ సెంటర్ లోని వెంకట కృష్ణారావు విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వ రరావు, శ్రీకాకుళం కూటమి నాయకులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాడికొండ చిన్నా ఆధ్వర్యంలో రూ 12 వేల రూపాయల విలువచేసే వందమంది నిరుపేద ఎస్టీలు, యాచకులకు నియోజకవర్గ యువ నాయకులు మండల వెంకట్రావు చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఈ కార్యక్రమంలో మండల వెంకట కృష్ణారావు శతజయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండల అభిమాను లు ఏఎంసీ చైర్మన్ కొల్లూరి. వెంకటేశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం. చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, బీసీ వైస్ చైర్మన్ బచ్చు. రఘునాథ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సహాయం అందజేశారు. బాధితుడు యర్రా వీరాంజనేయులు కుటుంబ సభ్యులను ఐఆర్ సిఎస్ కృష్ణాజిల్లా చైర్మన్ డాక్టర్ డీకే ప్రసాద్ ఆదివారం సాయంత్రం పరామర్శించారు. రూ. ఐదు వేలు సహాయాన్ని అందించడంతోపాటు ఐఆర్ సిఎస్ చల్లపల్లి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ స్టీల్ సామాగ్రి, హెవీ టార్పాలిన్, బియ్యం, సరుకులను డి ఆర్ కె ప్రసాద్ బాధ్యతలు అందించారు. సబ్ బ్రాంచ్ చైర్మన్ నడకుదురు లీల బ్రహ్మేంద్ర, వైస్ చైర్మన్ పేరం మధుసూదన్ రెడ్డి, కోశాధికారి ఎండిఏ కే జిలాని తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న సంజయ్‌దత్

కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానికవిజయలక్ష్మి కన్వర్షన్ హాల్లో సంఘటన్ శ్రీజన్ అభయన్ కార్యక్రమంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ సంజయ్ దత్ ఆదివారం పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీని ఆంధ్రప్రదేశ్‌లో గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు బలోపేతం లక్ష్యంగా పనిచేస్తానని సంజయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, లాయర్లు, బీసీ సంఘాలు, ఎస్సీ సంఘాలు, మైనార్టీ సంఘాలు ప్రతినిధులతో ముఖాముఖి చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం, పెడన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సొంటి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

6న ఎపిఎన్జీవోస్ ఎన్నికలు

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ గన్నవరం తాలూకా ఎన్నికలు ఈనెల 6వ తేదీ నిర్వహించేందుకు ఎన్నికల అధికారి ఏ నగేష్ బాబు నోటిఫికేషన్ విడుదల చేశారని గన్నవరం తాలూకా ఎపి ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు వి సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ డిశంబర్ 6వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీవోస్ హోంలో నామినేషన్ ప్రక్రియ ప్రారంభ మవుతుందని అన్నారు.

యుటిఎఫ్ మొవ్వ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండల నూతన యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో మొవ్వ మండల అధ్యక్షు డిగా యం.రవీం ద్రబాబు, ప్రధాన కార్యదర్శులుగా యం రత్నగిరిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులు కె.బ్రహ్మం, సహాధ్యక్షులు వైయస్ సతీష్, సహాధ్యక్షురాలు యస్.నీలిమ, కోశాధికారి కె శివనాగరాజు, ఆడిటర్ పి.రమేష్ బాబు, మండల కార్యదర్శులుగా వి.నాగ శ్రీనివాస్, బి.జయరాం, ఎయస్ యస్.కుమార్, కె గాయత్రి, బి సుధీర్, మంజూష, ఎ రాజేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్‌గా యం.రాణి, ఆర్.లంకేశ్వరరావు లు ఎన్నికయ్యారు.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించు కున్నారు. అమ్మ వారిని సుమారు 10 వేల మంది యాత్రికులు దర్శించు కోగా అత్యధిక స్థాయిలో యాత్రికులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానికి విచ్చేసిన యాత్రికులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్‌రావు, దేవస్థాన కార్యనిర్వ హణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కూరగాయల ధరలకు రెక్కలు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : మొంథా తుపాను ప్రభావంతో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. వ్యాపారులు ఒక్క రోజు వ్యవధిలోనే రెండు నుంచి మూడు రెట్లు ధరలు పెంచేయడంతో వినియోగదారులు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు అల్లాడుతుంటే ఇప్పుడు కూరగాయల ధరలు రోజు రోజుకు పెరగడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జేబు నిండా డబ్బులతో మార్కెట్‌కి వెళ్తే సంచిలో సగానికి కూడా కూరగాయలు రావటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట రైతు బజార్లో కూరగాయల ధరలు చుక్కలను తాకుతుండడంతో బయట దుకాణాల్లో ధరలు మరింత తారెత్తిస్తున్నాయి. రైతు బజార్లో ధరల కంటే బయట మార్కెట్లో రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కూరగాయల తోటలు పూర్తిగా దెబ్బ తినడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. రైతు బజార్‌లో టమాటా కిలో రూ.50 ఉంటే బహిరంగ మార్కెట్లో రూ.60లుగా ఉంది. వంకాయ కిలో రూ.24 ఉంటే బహిరంగ మార్కెట్లో రూ.40, బెండకాయ రైతు బజార్లో రూ.40- బహిరంగ మార్కెట్లో రూ.50, మిర్చి రైతు బజార్లో రూ.40- బహిరంగ మార్కెట్లో రూ.50, పచ్చిమిర్చి రైతు బజార్లో రూ.70- బహిరంగ మార్కెట్లో రూ.80, గోరుచిక్కుళ్ళు రైతు బజార్లో కేజీ రూ.50 - బహిరంగ మార్కెట్లో 60 రూపాయలు, ఇలా రోజు రోజుకి కూరగాయలు పెరుగుతూనే ఉన్నాయి. కూరగాయల ధరలు పెరుగుతున్నా

ధరల నియంత్రణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో మార్కెట్లో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి అమ్ముతున్నారు.

పచ్చడి మెతుకులే దిక్కు...

కూరగాయల ధరలు మండిపోతుండటంతో పచ్చడి మెతుకులే దిక్కు అవుతున్నాయి. గతంలో కూరగాయలు వండుకునే వాళ్ళం. ధరలు పెరగడంతో ఆచితూచి వండుకోవాల్సి వస్తుంది. తక్కువగా ఉన్న కూరగాయల ధరలు పెరిగిపోయాయి. బదులుగా అరకిలో కొనుక్కొని సర్దుకొని వండుకుంటున్నాం. ఒక పూట కూరతో తింటే మరొక పూట పచ్చడితో తింటున్నామని కంచర్ల నాగరాజు వాపోయారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మైలవరం : యుటియఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లాది తిరుపతిరావు, వాడపల్లి వసంతరావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం నూజివీడు రోడ్డులో గల సిఐటియు భవనంలో యుటిఎఫ్ మైల వరంశాఖ సమావేశం జరిగింద న్నారు. ఈ ఎన్నికలకు ప్రధాన

ఎన్నికల అధికారిగా ఎన్టీఆర్ జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు కుక్కడపు శ్రీనివాసరావు, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి కె.గంగరాజు వ్యవహరించగా, ముఖ్య అతిథులుగా రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి మనోహర్ కుమార్ హాజరయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతామని, పెండింగులో ఉన్న డిఎ బకాయిల విడుదల కోసం, 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించే వరకు ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటామని ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

పవిత్రోత్సవాలకు ఆహ్వానం

ప్రజాశక్తి -జగ్గయ్యపేట: తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో నవంబర్ 30 నుండి డిసెంబర్ 3వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవ ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను దేవస్థానం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)ను ఆయన నివాసంలో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసి కెనాల్ వైస్ చైర్మన్ మన్నె నారాయణరావు, బొల్లం పురుషోత్తం, ఇనపనూర్తి దాసు మరియు దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజయబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయబాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు పుట్టినరోజు వేడుకలు ఘనంగా

నిర్వహించారు. నాగులూరు, రాఘవాపురం, రెడ్డిగూడెం గ్రామాల్లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాగులూరు గ్రామములో జరిగిన కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటలు పోటీలు

ప్రజాశక్తి-వత్సవాయి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓ నాగరాజు నాయక్, వత్సవాయి, కన్నివేడు

జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అనిత శ్రీ, కొండలు ప్రారంభించారు. ఉపాధ్యాయులకు క్రికెట్, త్రో బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపికైన ఉపాధ్యాయులు డివిజన్ స్థాయిలో, ఆ తర్వాత జిల్లా స్థాయి పోటీలకు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో పిడి మార్పిడి బాబురావు, వై రవిబాబు, అజ్మీర్, రాంప్రసాద్, టి వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు

పేదల హక్కులు కాపాడాలని రాస్తారోకో

ప్రజాశక్తి-ఎ.కొండూరు : పేదల హక్కులు కాపాడాలని కోరుతూ ఆదివారం తిరువూరు -విజయవాడ జాతీయ రహదారిపై ఎ.కొండూరు అడ్డరోడ్డులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎ.కొండూరు మండల 9వ మహాసభను రావూరు బెనర్జీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ.. భారతదేశంలోని వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలపై బిజెపి ప్రభుత్వం దాడికి దిగిందన్నారు. గ్రామీణ పేదల ఉపాధి హక్కును దెబ్బతీయడమే కాకుండా, వారి ఓటు హక్కును కూడా హరించేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఉపాధి హక్కును కాపాడుకుంటూ వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా రావూరి బెనర్జీ, కార్యదర్శిగా పానెం.ఆనందరావు మరో 10 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మహిళా సంఘం మండల కార్యదర్శి మా దేవి, సిఐటియు నాయకులు విజయలక్ష్మీ, ప్రజానాట్య మండలి నాయకులు బి.వెంకటేశ్వరావు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

ఎంవిఆర్‌లో బార్ ఎగ్జామినేషన్

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల సమీపంలోని ఎంవి ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్స్ జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి భారీ ఎత్తున బార్ ఎగ్జామినేషన్స్ రాసేందుకు అభ్యర్థులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4 గంటల వరకు మూడు గంటల పాటు పరీక్షలు జరిగాయి. ఎంవిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష రాసేందుకు మొత్తం 1800 మంది అభ్యర్థులను కేటాయించినట్లు పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్, ఎం.వి.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ యు.ఏడుకొండలు తెలిపారు. పరీక్షకు మొత్తం 1753 మంది పరీక్షలకు హాజరుకాగా.. 47 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా ముగిశాయి. పరీక్షా కేంద్రం అబ్జర్వర్‌గా చదలవాడ త్రివేణి వ్యవహరించారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని జూపూడి నిమ్రా కళాశాలలో సైతం 576 మంది ఈ పరీక్షలు రాశారు.

టెట్ నుండి మినహాయించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-జి. కొండూరు : 2010 ముందు నియమించబడిన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జి.కొండూరు మండల సమావేశం ఆదివారం స్థానిక ప్రైవేటు హాలులో జరిగింది. యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎ భరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు, సుందరయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బోధన సమయాన్ని వృథా చేసే అనవసర యాప్‌లను రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, డిఎ, సరేండర్ లివ్‌ల బకాయిలు చెల్లించాలని, 2010 ముందు నియమించబడిన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మండల శాఖ నూతన గౌరవ అధ్యక్షురాలుగా బి.సుశీల, మండల అధ్యక్షునిగా

కె.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ హసన్ అహ్మద్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కె శ్రీనివాసరావు, పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి కె. గంగరాజు వ్యవహారించారు.

3న హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 3న ఉదయం 10 గంటలకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు సమక్షంలో హుండీల లెక్కింపు జరుగుతుందని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణ ఇందిరా దత్తు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేరోజు సాయంత్రం 4 గంటల నుండి దేవస్థానంలో కొబ్బరి కాయలు-కిరాణా సామాగ్రి అమ్ముకొను హక్కు లైసెన్సు, హోటల్ నడుపుకొనుటకు లైసెన్సు సంవత్సర కాలపరిమితికి దేవస్థాన ప్రాంగణంలో సీల్డు టెండరు-కం-బహిరంగ వేలం పాటలు, ఇ-టెండరు జరుపబడునని తెలిపారు. ఆసక్తి గలవారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

అత్యాచారం కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-గంపలగూడెం: అత్యాచారం కేసులో ఇద్దరు నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్లు గంపలగూడెం ఎస్‌సి అనిల్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పెద్ద కొమెర-తోటమూలలో ఉన్న మారుతి షోరూం నందు వినగడప గ్రామానికి చెందిన ఓ మహిళ సేల్స్ గర్ల్‌గా పనిచేస్తుంది. పని ముగించుకొని ఇంటికి వెళ్లే సమయంలో మహిళను షోరూం నిర్వాహకుడు సొబ్బాల గ్రామానికి చెందిన చెన్నోజు అశోక చారి, షోరూంలో పని చేసే శ్రీకాకుళానికి చెందిన పోతుల రాజేష్ కారులో ఎక్కించుకొని, గంపలగూడెం-తిరువూరు మధ్యన గల పొలిమేర సమీపాన మద్యం అత్యాచారం చేశారు. దీంతో బాధితురాలు ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అశోక చారి, రాజేష్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు.



ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన సమ్మెట సాయిరాం శ్రీ తిరుపతమ్మ అమ్మవారి నిత్యాన్నదానం పథకానికి రూ.10116 విరాళంగా అందజేశారు. సంబంధిత నగదును ఆలయ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశికపూర్‌లకు ఆదివారం అందజేసినారు. ఈ సందర్భంగా దాతలకు వేద ఆశీర్వాదం చేసి, అమ్మవారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆటో యూనియన్ అధ్యక్షునిగా చంటి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం "డాక్టర్ బాబూ జగజ్జీవన్ రాం ఆటో వర్కర్స్ యూనియన్" అధ్యక్షుడుగా చాట్ల చంటి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ఆటో వర్కర్స్ కోసం ఎలాంటి విభేదాలు లేకుండా పని చేస్తానని తెలిపారు.

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

- జిపిఎస్ జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలో ఉన్న గిరిజనులు హక్కుల సాధనకై ఉద్యమించాలని, గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. మచిలీపట్నం ఎన్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం గిరిజన ప్రజా సమాఖ్య, విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వడిత్యా శంకర్ నాయక్ మాట్లాడుతూ. దేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్న నేటికీ రాష్ట్రంలోని లక్షలాదిమంది గిరిజనులకు కనీసం కూడు, గూడు, నీడ లేక పరితపిస్తున్నారని, ఇప్పటికీ రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేక దుర్భరమైన జీవితాలు జీవిస్తున్నారన్నారు. నేటికి ఆధార్ కార్డు లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ ఫలాలకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గిరిజన జాతీ అభివద్ధికి ప్రతి ఏటా ప్రభుత్వాలు కేటాయించే కోట్లాది రూపాయలు నిధులను దారి మళ్లించకుండా వినియోగించబడాలంటే చట్టసభలలో గిరిజనుల తరపున ప్రాతినిత్యం వహించే వ్యక్తి ఉండాలన్నారు. అందుకోసం హక్కుల సంరక్షణకు సంఘటితంగా కలిసికట్టుగా ఐక్యమత్యంతో ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలోని గిరిజనులకు రాజకీయంగా మన్యం ప్రాంతాలకు పరిమితం చేయటం వలన మైదాన ప్రాంత గిరిజనులకు గత 58 సంవత్సరాలుగా జరగవలసిన అన్యాయం భారీగా జరిగిపోయిందన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనను తీసుకోరావటం చాలా బాధాకరంగా ఉందన్నారు. గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, కార్పొరేటర్ యాకసిరి వెంకటేశ్వరరావు, గిరిజన నేతలు పద్మరాజు, రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, సుగాలి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్, సాలా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ధాన్యం రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలోని మల్లేశ్వరం, అర్తమూరు, సాతులూరు గ్రామాల్లో రైతుసంఘం ఆధ్వర్యంలో రోడ్డుపైన ఉన్న ధాన్యం రాసులను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం దెబ్బతిన్న రంగు మారిన, బులిగిపోయిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి కొనుగోలు చేసి రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ పర్యటనలో రైతుసంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, బంటుమిల్లి మండల రైతు సంఘం అధ్యక్షుడు మలిశెట్టి శివరాం ప్రసాద్, రైతులు తోకల నాగరాజు, పోలగాని అంజిబాబు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేయాలి : తహశీల్దారు

ప్రజాశక్తి-ఘంటసాల : దిత్వా తుఫాన్ తగ్గేవరకు రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని తహసీల్దార్ విజయప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తెలుగురావుపాలెం, చినకళ్లేపల్లి, ఘంటసాల పాలెం గ్రామాల్లో కొనసాగుతున్న వరి కోతలను ఆదివారం తహసీల్దార్ నిలుపుదల చేశారు. వర్షం ముంచుకొస్తున్న విషయం తెలిసినా మిషనరీలతో కోతలు కోయటం సరికాదని, కోతలు వాయిదా వేయాలంటూ రైతులకు నచ్చచెప్పారు. రైతులు తొందరపడి కోతలు కోయరాదని, తమ వద్ద ఉన్న ధాన్యాన్ని భద్రపర్చు కోవాలని సూచించారు. ఘంటసాల, కొడాలి గ్రామాల్లో ఉన్న గోడౌన్లలోనూ, గ్రామాల్లోని పాత స్కూల్ బిల్డింగ్లలో దాన్యం భద్రపర్చుకోవాలని, ఆర్ఎస్కేల ద్వారా అవసరమైన రైతులకు టార్పాలిన్ పట్టాలు అందిస్తున్నట్లు తెలిపారు. **ప్రజాశక్తి - నాగాయలంక** : దిత్వా తుపాను కారణంగా కోస్తాంధ్రలో సోమ, మంగళవారాలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో మండలంలోని రైతులు వరి కోతలను రెండు రోజులు పాటు వాయిదా వేసుకోవాలని ఏఓ ఎ. సంజీవ్ కుమార్ సూచించారు. తప్పనిసరి పరిస్థితులలో కోతలను అన్నదాతలు కోసినట్లయితే అందుబాటులో రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని ఆయన కోరారు. ఆరబెట్టిన ధాన్యానికి టార్ఫాలిన్లు కప్పు కోవాలని ఆయన సూచించారు.

ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : దిత్వా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆరబెట్టిన ధాన్యంతో పాటు గోనె సంచుల్లో నింపిన ధాన్యం వర్షానికి తడవకుండా పట్టాలు, టార్పాలిన్లు కప్పి కాపాడుకోవాలని మండల తహసీల్దార్ కె.సురేశ్‌కుమార్ సూచించారు. దిత్వా తుపాను ప్రభావంతో ఆదివారం ఆకాశం మబ్బులు కమ్మి చిన్న పాటి వర్షపు చినుకులు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పర్యటించి రోడ్లపక్కన, ఖాళీస్థలాల్లో ఆరబెట్టిన ధాన్యం, ధాన్యం బస్తాలు చూసి రైతులకు పలుసూచనలు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తుపాను కా రణంగా ధాన్యం తడిసి పాడవ్వ కూడదన్న ఉద్దేశంతో మండలానికి 495 టార్పాలిన్లు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర వ్యవసాయ శాఖ అధికారులకు అందించామని తెలిపారు.

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దారు

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-కంకిపాడు: కంకిపాడు మండలంలోని గ్రామాలలో దిత్వా తుఫాన్ నేపథ్యంలో మండల వ్యవసాయ అధికారి ఉషారాణి, మండల స్పెషల్ ఆఫీసర్ రత్నచార్యులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం సందర్శించారు. తుఫాన్ నేపథ్యంలో రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కోసిన ధాన్యాన్ని, రాశుల మీద ఉన్న ధాన్యాన్ని టార్పానులతో కప్పుకోవాలని, ధాన్యం బస్తాలలో నింపిన దానిని త్వరగా మిల్లులకు తరలించాలని, కోతకోయకుండా ఈ రెండు మూడు రోజులు హార్వెస్టింగ్ ఆఫ్ చేయాలని రైతులకు సూచించారు. **ప్రజాశక్తి- కోడూరు** : దిత్వా తుఫాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం రైతులకు అనునిత్యం అందుబాటులో ఉండి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ తెలిపారు. ఆదివారం వెంకట్రామ్ కోడూరు, లింగారెడ్డిపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, సంత మార్కెట్ ఆవరణలోని గోడౌన్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, సొసైటీ చైర్మన్లు, నాయకులు, మిల్లరుతో మాట్లాడి క్షేత్ర స్థాయి పరిస్థితిని పరిశీలించారు. తుఫాన్ నేపథ్యంలో ధాన్యానికి ధర రావట్లేదనే అపోహలను రైతులు నమ్మవద్దని సూచించారు. రైతులు తొందరపడి వ్యాపారులు, దళారుల వద్దకు వెళ్లి తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దని సూచించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిరుపతి శ్రీనివాసరావు, ఇంచార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, పీఏసీఎస్ చైర్మన్లు పూతబోయిన కరుణ కుమార్ పాల్గొన్నారు.

కంకిపాడులో ధాన్యం కొనుగోలు పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పమిడిముక్కల : ఆటలతో ఆరోగ్యం వస్తుందని పమిడిముక్కల డివైఇఒ పద్మారాణి అన్నారు. పమిడిముక్కల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యా యులకు క్రికెట్, త్రోబాల్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఇఒ మాట్లాడుతూ ఆటలతో వ్యాధులు దరిచేరవన్నారు. విద్యార్థులు ఆటల్లో కూడా నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు, హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు రవీంద్రబాబు, మట్ట విజయకుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

బందరులో టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రైతులకు టార్పాలిన్ పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : దిత్వా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో సోమవారం, మంగళవారం వర్షం కురిసే అవకాశం ఉన్నందున రైతులు తాత్కాలికంగా వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామ్ కుమార్ రైతులకు సూచించారు. మచిలీపట్నం మండలం లోని అరిసేపల్లి గ్రామంలో ఆర్ ఎస్ కె లో ఆదివారం రైతులకు టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేసారు. కోత కోసి పనల మీద ఉన్న వరిని వెంటనే కుప్పలు వేసుకొని పరదాలతో కప్పుకోవాలని, మెరక ప్రదేశాల్లో ఆరబెట్టుకుంటున్న వరిని బస్తాల్లోకి నింపుకొని సురక్షిత ప్రదేశంలకు తరలించుకోవాలని తెలిపారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : దిత్వా తుఫాను నుండి వరి పంట రాశులు, వరికుప్పలను రక్షించుకునేందుకు రైతులకు ఆదివారం పట్టాల పంపిణీ చేశారు. తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో 320 టార్బా లిన్ పట్టాలను రైతులు ఉపయోగించుకొని తిరిగి ఇచ్చేలా వారికి అందజేశారు. మొవ్వ ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, మండల వ్యవసాయాధికారి కె. మురళీకష్ణ ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్ గ్రామ రెవెన్యూ అధికారులు ఎం.ప్రశాంత్ పి. వెంకటేశ్వరరావు, సొసైటీ సీఈవో పుట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుతులు అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : బుచ్చుపేట వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో చిన్నారులకు భగవద్గీత పారాయణ పోటీలు నిర్వహించారు. పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ముత్తేవి రవికాంత్, దేవస్థానం ఆస్థాన విద్వాంసుడు ముత్తేవి, మడమల రాంబాబు, గురుజాడ రాజేశ్వరి, బందావన దాస్ , జొన్నలగడ్డ మాధవి, గరికపాటి వీరాంజనేయలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెట్ల కొమ్మలతో ఇబ్బందులు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : ఇటీవల మొంథా తుఫాన్ దాటికి విరిగిపడిన చెట్లు కొమ్మలు రోడ్లపై నుంచి తొలగించ పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అక్టోబర్‌లో వచ్చిన తుపాన్ బీభత్సం వలన మచిలీపట్నంలో ఎన్నో చెట్లు కుప్పకూలాయి. చాలాచోట్ల కూలిన చెట్లను తుఫాన్ అనంతరం రెండు రోజుల్లోనే తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. పరాసుపేటలోని సత్యా కన్వెన్షన్ ఎదురు రోడ్డులో మాత్రం పడిపోయిన చెట్లనుండి వచ్చిన కొమ్మలను తొలగించి రోడ్డు పక్కన పడేసారు, రెండు గుట్టలుగా పెట్టడం వలన నెలరోజుల నుండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఇటువైపు రెండు ప్రైవేట్ పాఠశాలలు కూడా ఉన్నాయి. ఉదయం సాయంత్రం ఈ రోడ్డు స్కూల్ బస్సులు, ఆటోలతో ఎంతో రద్దీగా ఉంటుంది. పడవేసిన ఆ కొమ్మలను తప్పించుకుని వాహనదారులు ప్రయాణిస్తున్నా, ఆ గుట్టలను మాత్రం మునిసిపల్ శానిటేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏసుబాబుకు సత్కారం

ప్రజాశక్తి-పామర్రు : యూనియన్ల సంక్షేమం కోసం కృషిచేసిన వారిని తగు రీతిలో అభినందించాలని రాష్ట్ర టైపిస్ట్ అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ గోపాలకృష్ణ అన్నారు.పామర్రు నియోజకవర్గంలోని పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా పదవీ విరమణ పొందిన రాష్ట్ర టైపిస్టు సంఘం ఉపాధ్యక్షుడు కొలుసు ఏసుబాబుకు విజయవాడ రూరల్ మండల్ ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సంగం రాష్ట్ర కార్యదర్శి నాగూర్, జిల్లా సంఘ సభ్యులు జిల్లా తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో దామినికి పతకాలు

విజయవాడ : జాతీయ తైక్వాండో పోటీలో కలతోటి దామినికి పతకాలు వరించాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో నవంబర్ 21 నుంచి 23 వరకు జరిగిన పోటీలో వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో పోటీపడి ఐదు పతకాలు సాధించింది. రెండు బంగారు, రెండు రజత, ఒక కాంస్య పతకాలను గెలుసుకుంది. 55-59 కేజీల విభాగంలో ఆమె తన ప్రతిభను చాటింది. కోచ్, ఉమ్మడి కృష్ణా జిల్లా సెక్రటరీ మలిశెట్టి అంకమ్మరావు ఆధ్వర్యంలో దామిని శిక్షణ పొందుతోంది. గతంలో కూడా వివిధ ప్రాంతాల్లో జరిగిన పోటిల్లో పతకాలు సాధించింది. దామిని తన ప్రతిభను చాటి పతకాలు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని జూపూడి గ్రామానికి చెందిన దామిని గుణదల డాన్ బోస్కో స్కూల్లో 9వ తరగతి చదువుతోంది. తండ్రి కలతోటి రమేష్ మెడికల్ రంగంలో, తల్లీ స్నేహలత అధ్యాపకురాలుగా పని చేస్తున్నారు.

అలరించిన వాయులీన కచేరీ

విజయవాడ : వాయులీన త్రయం పాలపర్తి నాగేశ్వరరావు (తండ్రి), పాలపర్తి చంద్రశేఖర్ (కుమారుడు), అంబటిపూడి కామాక్షి (మనవరాలు)- మూడు తరాల నిష్ణాతుల వాయులీన సుధల్ని పెద్ద సంఖ్యలో హాజరైన శ్రోతలు తన్మయులై తనివితీరా గ్రోలారు. శ్రీ మహా గణపతి... (గౌళ రాగం.. మిశ్రచాపు తాళం.. దీక్షితార్ రచన), మామవసదా జననీ... (కానడ రాగం.. రూపక తాళం.. స్వాతి తిరునాళ్ రచన), నీ వల్ల గుణ దోషమేమి... (కాపి రాగం.. ఖండచాపు తాళం.. త్యాగరాజు రచన), అటుకారాదని... (మనోరంజని రాగం.. ఆది తాళం.. త్యాగరాజు రచన) మొదలగు కీర్తనల అద్భుత వాయులీన కచేరీకి- సహ వాద్య విద్వాంసులు పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ మృదంగంపై, ఎం.హరిబాబు ఘట్టంపై కడు సమర్ధనీయంగా సహకారమందించారు. ఉన్నత శ్రేణి కళాకారులతో వారం రోజులుగా అద్భుతంగా జరుగుతున్న "శ్రీసద్గురు సంగీత సభ" 32వ వార్షిక సంగీత మహోత్సవాలు ఆదివారం రాత్రి ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ముగిశాయి. ఈ సందర్భంగా- కళా షష్టి పూర్తి చేసుకుంటున్న ప్రముఖ వయోలిన్ విద్వాంసులు పాలపర్తి నాగేశ్వరరావుకు "సద్గురు సంగీత విద్వన్మణి" బిరుదు ప్రదానం చేశారు. 'అభినందన ప్రణవ రాగమాలిక'ను సమర్పించారు. నాగేశ్వరరావు దంపతుల్ని పలువురు నూతన వస్త్రాలు, దుశ్శాలువాలు, పూల దండలతో ఘనంగా సత్కరించారు. సభ అధ్యక్షులు ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ బి.వి.ఎస్.ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో దత్తపీఠ ఆస్థాన విద్వాన్ బ్రహ్మశ్రీ చింతపల్లి సుబ్రహ్మణ్యశర్మ, ప్రముఖ సంగీత విద్వాంసులు "సద్గురు సంగీత విద్వన్మణి" ఎన్సీహెచ్ బుచ్చయ్య ఆచార్యులు, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ పాల్గొన్నారు. ప్రతిభావంతులైన పలువురు యువ కళాకారులకు నగదు పురస్కారాలు, మరో ఇద్దరు కళాకారులకు ఆర్థిక సహాయం "సభ" అందించింది. శ్రీ ధాత్రి ఆర్థోపెడిక్ అండ్ గైనకాలజీ సెంటర్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్నిసభ ఉపాధ్యక్షులు బి.హరి ప్రసాద్, కార్యదర్శి పోపూరి గౌరీనాథ్, కోశాధికారి వీఆర్ సుబ్రహ్మణ్యం, సభ్యులు పి.మురళీకృష్ణ, గాయత్రీ గౌరీనాథ్, ఎన్.వి.ఎస్. అంజనీకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-మైలవరం : ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక లక్కిరెడ్డి హనుమ రెడ్డి క్రీడా ప్రాంగణంలో గత వారం రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి డీఏ ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పెన్నా ఎఫ్‌సి, తుంగభద్ర ఎఫ్సి మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఇరుజట్లు చెరో రెండు గోల్స్ చేయటంతో మ్యాచ్ డ్రా అయ్యింది. అనంతరం రెండు టీములకు పెనాల్టీలు ఇవ్వగా 2-3 గోల్స్ తేడాతో పెన్నా ఎఫ్‌సి విజయం సాధించి మొదటి బహుమతిని గెలుచుకుంది. అనంతరం డాక్టర్ అనిమిరెడ్డి, జయప్రకాశ్ రెడ్డి, లయన్ ఎస్వీఎన్ నివత్ రావు లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిఎస్డివో బి సుధాకర్, జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శేషగిరిరావు, ఈసీ మెంబర్ చక్రవర్తి, బుజ్జి క్రీడాకారులు స్థానికులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా సినీ సంగీత విభావరి

విజయవాడ : "ఆర్ఆర్ఆర్ మెలోడీ" ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళా వేదికపై ఆదివారం రాత్రి సినీ సంగీత విభావరి జరిగింది. రాయరాజు తమ తల్లిదండ్రుల స్మృతి లో.. తన నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో దండు చంద్రశేఖర్, రూప, లక్ష్మణ్ నాయక్, సుమలత, కిషోర్ తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు పాడిన ఆయా సినిమా పాటలు ప్రేక్షకుల్ని అలరించాయి. కే డేవిడ్ రాజు, శర్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సౌండ్: డి.జె. రాము, ట్రాక్స్: శ్రీనివాస్ (జీఎస్ మెలోడీస్).

నేడు ప్రపంచ ఎయిడ్స్ డే

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 1 ఉదయం 9.30 గంటల నుండి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాలను నగరంలోని స్థానిక తుమ్మలపల్లి కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం, అలాగే ప్రపంచవ్యాప్తంగా ఏకత్వం, సంఘీభావాన్ని ప్రదర్శించడం కార్యక్రమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారన్నారు. ఆ శాఖ ప్రధాన కార్యదర్శి సౌరబ్ గౌర్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, మిషన్ డైరెక్టర్ (ఎన్‌ఎచ్‌ఎం) జి వీర పాండ్యన్, డైరెక్టర్ సెకండరీ హెల్త్ కేబీఎన్ చక్రధర బాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ, తదితరులు పాల్గొననున్నారని తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు విజయవాడలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి నుండి "తుమ్మలపల్లి కళాక్షేత్రం" వరకు ప్రారంభమయ్యే ర్యాలీని మంత్రి సత్య కుమార్ యాదవ్, శాసనసభ్యులు, అధికారులు ప్రారంభించనున్నారని తెలిపారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

'అను మై బేబీ'లో చిల్డ్రన్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : స్త్రీలు, ప్రసూతి వైద్య సేవలు, చిన్నపిల్లలు, నవజాత శిశువుల చికిత్సలకు ప్రసిద్ధి చెందిన అను మై బేబీ హాస్పిటల్ నందు చిల్డ్రన్స్ డే ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. నవంబర్ 9న ప్రారంభమైన ఈ వేడుకల ముగింపు కార్యక్రమం ఎనికేపాడులోని అను మై బేబీలో ఆదివారం నిర్వహించారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీదేవి నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలు 'హెల్దీ కిడ్స్ హ్యాపీ ఫ్యూచర్స్' థీమ్‌తో వినూత్నంగా సాగాయి. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో చిన్నారులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. వరల్డ్ ప్రీమెచ్యూరిటీ డే సందర్భంగా నవంబర్ 17న ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు ప్రసంగించి, నెలలు నిండకుండా ప్రీమెచ్యూర్ బేబీల సంరక్షణ గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అదే క్రమంలో 23న జరిగిన అను మై బేబీ కిడ్స్ కార్నివాల్.. చిన్నారులకు అద్భుతమైన అనుభూతులను అందించింది. రింగ్ టాస్, ఫేస్ పెయింటింగ్, బెలూన్ పాపింగ్, పజిల్ కార్నర్, స్టోరీ టెల్లింగ్ సెషన్లతో విభిన్నంగా సాగిన ఈ కిడ్స్ కార్నివాల్ నందు ఏర్పాటు చేసిన 'ఐయామ్ విత్ అను మై బేబీ - ఫొటో బూత్ అండ్ సోషల్ మీడియా పోస్ట్స్' అంశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన బాల్యం.. ఆనందదాయకమైన భవిష్యత్తు.. అనే అంశంతో చిల్డ్రన్స్ డే వేడుకలను నిర్వహించామని తెలిపారు. అదేవిధంగా, పిల్లల పెంపకం, సంరక్షణ విషయంలో తల్లిదండ్రుల కోసం నిర్వహించిన అవగాహన కార్యక్రమాలతో ఈ చిల్డ్రన్స్ డే వేడుకలు పరిపూర్ణమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.శ్రీదేవి, పలువురు వైద్యులు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఈ నెల 11న ప్రారంభమయ్యే భవాని దీక్షల విరమణ కార్యక్రమం 15న జరిగే మహా పూర్ణాహుతి కార్యక్రమంతో ముగుస్తాయి. రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది యాత్రికులు అమ్మవారి మాలాధారణ చేసి దీక్షా విరమణ కోసం విజయవాడకు తరలివస్తారు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు, పోలీస్ అధికారులతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను, గిరి ప్రదక్షిణ ప్రాంతాన్ని, స్నాన ఘాట్లు, హోమగుండాలు, విరుముడుల స్టాండ్ల ఏర్పాటు, ప్రదేశాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. గిరిప్రదక్షిణ సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లపై సూచనలు చేయడంతో పాటు, దర్శన సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. క్యూలైన్లను, దర్శనం అనంతరం భక్తులు వెళ్లే మార్గాలను కూడా పరిశీలించి పటిష్ట మైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. భవానీల సౌకర్యార్థం రెండు ఫుట్ బ్రిడ్జిల ఏర్పాటుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు కృష్ణకాంత్ పాటిల్, షీరిన్ బేగం, ఎసిపిలు డి.పావన్ కుమార్, రామ చంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు, నాటిక ప్రదర్శనలు

విజయవాడ : సాంస్కృతిక సేవా సంస్థ "దృశ్య వేదిక" నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక వి.హెచ్.గ్రంథాలయంలో నృత్యాలు, నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రముఖ నాట్యాచారిణి గోనుగుంట్ల శైలశ్రీ నిర్వహణలో శ్రీ నృత్య కళా నిలయం సమర్పణలో సింహనందిని నృత్యం, కూచిపూడి నృత్యం ఆహ్లాదకరంగా జరిగాయి. బాలికలు జి.సత్యానందిని, సుజయరాఘవి, ఎం.లావణ్య, కావ్యశ్రీ, సంజన, ఎసిక, కాత్యాయని, శైలజ, ఖ్యాతి, చంద్రవర్షిణి, జష్విత, తన్మయి, రిత్విక, వేద, రీతిక, భావన, ఖ్యాతిక ఆయా కీర్తనలకు చక్కగా నర్తించారు. కార్యక్రమలో రెండో భాగంగా "రేపటి శత్రువు" నాటికను జ్యోతి సరళ స్మారక కళాపరిషత్, అనకాపల్లి కళాకారులు పి.సిహెచ్ నాయుడు దర్శకత్వంలో హృద్యంగా ప్రదర్శించారు. రేపటి శత్రువు వార్ధక్యమే.. దాన్ని సమర్ధంగా ఎదుర్కోవాలంటే- కాలూ చెయ్యి బాగున్నప్పుడే.. సంతానం మీద ఆధారపడకుండా- రేపటి కోసం.. ఎంతో కొంత అంగ, ఆర్థిక బలాన్ని కూడబెట్టుకోవడం అవసరమని ప్రబోధించే నాటికను ఆకెళ్ల రచించారు. కార్యక్రమాల్ని సంస్థ అధ్యక్షుడు హెచ్.వి.ఆర్.ఎస్.ప్రసాద్, నరేన్, సాగర్, రమేష్, భాగ్యరాజ్ తదితరులు సమన్వయపరిచారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి

ప్రజాశక్తి- విజయవాడ సిటీ

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దుర్గమ్మను పంచ హారతుల సమయంలో దర్శించుకున్నారు. ఆదివారం దుర్గమ్మ సన్నిధికి విచ్చేసిన జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు ఆలయ ఈవో వికె శీననాయక్, సాదర స్వాగతం పలికారు. జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబం అమ్మవారి దర్శనం అనంతరం ఆశీర్వచనం మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.